


ఏళ్లు గడుస్తున్నా నీళ్లేవి?



నెలబల్ల పొలాల్లో ప్రవహిస్తున్న 14(ఆర్) గంగ కాలువ




1. పడమట్టికండ్రిగ అడవిలో 14(ఆర్) కాలువ
2. మైలాంగం మద్దెలగుంట చెరువు సమీపంలో 14(ఆర్) గంగ కాలువపై అసంపూర్తిగా ఉన్న వంతెన పనులు

3. అవలిగండి చెరువు సమీపంలో అడవిలో ఆగిన కాలువ పనులు
4. పడమట్టికండ్రిగ అడవిలో తవ్విన కాలువ అసంపూర్తి పనుల్లో దట్టంగా పెరిగిన చెట్లు

- నత్తనడకన 14(ఆర్) గంగ కాలువ పనులు
- ఆశగా నిరీక్షిస్తున్న 25 గ్రామాల రైతులు
- కాలువలు పూర్తయితే 38వేల ఎకరాలకు నీరు

తెలుగుగంగ కాలువ పనులకు ఆది నుంచి అడ్డంకులు శాపంగా పరిణమిస్తున్నాయి. రెండు దశాబ్దాల క్రితం పునాది పడినా నేటికీ అడుగు ముందుకు పడటం లేదు. ఫలితంగా ఈ కాలువ నీటితో సాగుచేయాలనే రైతుల కోరిక నెరవేరడంలేదు. 2002లో దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో 38వేల ఎకరాలకు సాగు నీరందించాలనే సంకల్పంతో నాటి టీడీపీ ప్రభుత్వం 14(ఆర్) తెలుగుగంగ కాలువ పనులకు శ్రీకారం చుట్టింది. కండలేరు జలాశయం నుంచి చెన్నై వెళ్లే సత్యసాయి తెలుగుగంగ కాలువకు ఉప కాలువగా దీనిని రూపొందించారు. రెండు మండలాల్లో 25 గ్రామాల రైతులకు ఉప కాలువల ద్వారా సాగు నీరు అందించాలనేది ఉద్దేశం.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

23 సంవత్సరాలుగా వీడని గ్రహణం

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2002లో కాలువ పనులు ప్రారంభించింది. అయితే రెండేళ్లకే ప్రభుత్వం మారిపోయింది. కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టింది. దీంతో పనులకు గ్రహణం పట్టింది. పనులు ఆగిపోయాయి. కొన్నిచోట్ల అటవీ శాఖ అనుమతులు లేక, ఎగువ ప్రాంత రైతుల అభ్యంతరాలు తదితర కారణాలతో పనుల్లో పురోగతి కనిపించలేదు. తమ భూముల్లో కాలువపోతుందని మరోపక్క నెలబల్లి గ్రామ రైతులు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలిపారు. దీంతో పనులు ముందుకు సాగలేదు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో ఈ విషయంలో కనీస శ్రద్ధ చూపలేదు.

పునఃప్రారంభమైనా మళ్లీ బ్రేక్

2014లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. కాలువకు సంబంధించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని నాటి సీఎం చంద్రబాబు ఆదేశించారు. పనుల కోసం రూ.22.5 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో మంత్రిగా ఉన్న నారాయణ చొరవ తీసుకుని అటవీశాఖ అనుమతులు రప్పించడంలో సఫలీకృతమయ్యారు. నెలబల్లి రైతులనూ ఒప్పించారు. వారి పరిహారంపైనా చర్యలు తీసుకోవడంతో 2016 ఆగస్టులో 14(ఆర్) కాలువ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. అయితే కొన్ని రోజులకే వర్షాలు కురవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. తిరిగి ప్రారంభించడంలో నిర్లక్ష్యం చూపుతూ వచ్చారు.

గాలికొదిలేసిన వైసీపీ : 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాలువ పనులపై శీతకన్ను వేసింది. దీనికితోడు కాంట్రాక్టర్లలోనూ చలనం కనిపించలేదు. అనుమతులు వచ్చిన అటవీ ప్రాంతాల్లోనూ తవ్వకాలను గాలికొదిలేశారు. ప్రతిపాదిత వంతెనల నిర్మాణాల ఊసే పట్టించుకోలేదు. చివరి తడికోసం రైతులు అల్లాడిపోయినా వైసీపీ ప్రభుత్వ పెద్దలు కన్నెత్తి చూడలేదు. ఈ నేపథ్యంలో ఏడాదిన్నర క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు సీఎం కావడంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి. అయితే నేటికీ పనుల్లో కదలిక రాలేదు. నాడు ఈ పనుల విషయంలో చొరవ చూపిన మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు. 38వేల ఎకరాలకు సాగునీరందించే కాలువ పనులు పూర్తి చేస్తారని వీరంతా ఆశతో నిరీక్షిస్తున్నారు.



ప్రభుత్వం చొరవ చూపాలి

కాలువ పనులను పూర్తి చేస్తే నెలబల్లికి దిగువ ప్రాంత గ్రామాలైన పడమట్టికండ్రిగ, ఆనేపూడి, వడ్డికండ్రిగ, పూలతోట, కొత్తపల్లి గ్రామాలకు నీరు వస్తుంది. సూళ్లూరుపేట మండలంలో కోటపోలూరు, తూర్పుపల్లెలకు గంగ నీరు చేరుతుంది.పంటలు ఎండిపోకుండా కాపాడుకోవచ్చు. కాలువ సమస్యను పరిష్కరించేందుకు పాలకులు చొరవ చూపాలి.

- మురళీరెడ్డి, సర్పంచ్, ఆనేపూడి

చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్నాం



ఏళ్ల తరబడి కాలువ నీటి కోసం ఎదురు చూస్తున్నాం. పలు పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆగిన పనులను పూర్తి చేస్తే నేలపట్టు, మైలాంగం గ్రామాల్లో పంటలు ఎండిపోకుండా రక్షించుకోవచ్చు. ఈ ఏడాది మేమే కొన్నిచోట్ల చిన్నపాటి కాలువలుగా తవ్వి నీరు తెచ్చుకున్నాం. పక్షుల విడిదికి కూడా 14(ఆర్) గంగ కాలువ నీరు అవసరం.

- దువ్వూరు గోపాలరెడ్డి, ఉప ఎంపీపీ, మైలాంగం



హైందవ ధర్మ పరిరక్షణలో.. నాయీ బ్రాహ్మణుల పాత్ర కీలకం

- ధన్వంతరి జయంతి ఉత్సవంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్
- తిరుపతి నగరంలో వైభవంగా శోభాయాత్ర



తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 18(ఆంధ్ర జ్యోతి): హైందవ ధర్మాన్ని రక్షించడంలో నాయీ బ్రాహ్మణుల పాత్ర కీలకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. వారి సంప్రదాయ వృత్తి కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతోందని, తద్వారా ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి వృత్తి కార్పొరేట్‌పరం కాకుండా కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్పత్రులు, జైళ్లు, పోలీసు శాఖల్లో నాయీ బ్రాహ్మణులకు ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయాల్లో నాదస్వరం, డోలు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తిరుపతిలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శోభాయాత్ర, సభా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా మాధవ్ పాల్గొన్నారు. ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కంటే ముందే విదేశీ శక్తులు వర్ణ వివక్షతో బీసీ కులాలపై దాడి చేశాయన్నారు. సనాతన హిందూ ధర్మంలో బీసీ కులాల పాత్ర కీలకమని వివరించారు. బీసీ కులాలను వివక్ష నుంచి విముక్తి చేయడానికి ధన్వంతరి జయంతి ఉత్సవాన్ని నిర్వహించినట్లు చెప్పారు.నాయీ బ్రాహ్మణుల హక్కుల పరిరక్షణకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. దీనికిముందు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సురేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడారు.

కన్నులపండువగా శోభాయాత్ర

ధన్వంతరి జయంతి ఉత్సవంలో భాగంగా తిరుపతిలో శోభాయాత్ర కన్నుల పండువగా నిర్వహించారు. బాలాజీకాలనీ పూలే విగ్రహం నుంచి గాంధీభవన్ వరకు సాగిన ఈ యాత్రలో నాయీ బ్రాహ్మణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర ప్రముఖులు గాంధీభవన్ వేదికగా ధన్వంతరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, దీపప్రజ్వలనతో సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సినీ సంగీత దర్శకురాలు, గాయని ఎంఎం శ్రీలేఖ ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి.



సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా నేతలు సామంచి, భానుప్రకాష్‌రెడ్డి

మేనకూరు సెజ్‌లో త్వరలో సంగం డెయిరీ

- చైర్మన్ దూళిపాళ నరేంద్ర వెల్లడి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మేనకూరు సెజ్‌లో త్వరలో సంగం డెయిరీ ప్రారంభించనున్నట్లు చైర్మన్, ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర తెలిపారు. శనివారం రాత్రి సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ సహకారంతో భూమిని సేకరించి 2 లక్షల నుంచి 4 లక్షల లీటర్ల సామర్థ్యంతో డెయిరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంత పాడి రైతుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో డెయిరీ ద్వారా లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో సంగం డెయిరీ ప్రారంభిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు శివప్రసాద్, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రఫి, సంచి కృష్ణయ్య, పెసల కిషోర్‌బాబు, అశోక్‌రెడ్డి, విజయకుమార్ నాయుడు, ప్రసాద్‌నాయుడు, సుబ్బారావు, నిత్యకృష్ణారెడ్డి, రవి, చెంగయ్య, భాస్కర్, చెంచయ్య, అవధానం సుధీర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు దూళిపాళ్ల నరేంద్ర, విజయశ్రీ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ విజయభాస్కరరావు

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ విజయభాస్కరరావు

ఎస్వీయూలో ముగిసిన యువతరంగ్ - 2025

మానవ జీవన వికాసానికి కళలే మూలాధారం







తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవన వికాసానికి కళలు మూలాధారంగా నిలుస్తాయని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ విజయభాస్కరరావు పేర్కొన్నారు. మూడు రోజులుగా ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన యువతరంగ్ - 2025 కార్యక్రమం శనివారం ముగిసింది. సాయంత్రం శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించిన సమాపనోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన విజయభాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడా సాంస్కృతిక అంశాల్లోనూ ప్రతిభను పెంచుకోవాలని కోరారు. కళల్లో మన సంస్కృతి సంప్రదాయాలు నిక్షిప్తమై ఉన్నాయని అభిప్రాయపడ్డారు. గౌరవ అతిథి ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సంగీతం, నృత్యం, కళల పట్ల ఆసక్తిని పెంపొందించినట్లు అయిందని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, న్యాయ నిర్ణేతలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చివరి రోజు సందడే సందడే

యువతరంగ్‌లో భాగంగా మూడవ రోజైన శనివారం శ్రీనివాస ఆడిటోరియం, అన్నమయ్య భవనం, సెనేట్ హాల్లో సాంస్కృతిక పోటీలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రత్యేక ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు.




తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా మౌర్య

తిరుపతి జేసీకి అదనపు బాధ్యతలు



తిరుపతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి జాయింట్ కలెక్టర్‌కు నెల్లూరు తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది. అయితే తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఇటీవల జరిగిన బదిలీల్లో పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా పోస్టింగ్ పొందిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ఇప్పటివరకు రెగ్యులర్ జేసీని నియమించలేదు. తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్యకు జాయింట్ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం తిరుపతి జేసీకి నెల్లూరు తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ పోస్టులో కూడా తిరుపతి కమిషనరే తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కొనసాగనున్నారు.

స్విమ్స్ ఓపీ, ఓటీలకు రేపు సెలవు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):దీపావళి పండుగ సందర్భంగా సోమవారం స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతాయని, రోగులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

స్వచ్ఛ దీపావళే లక్ష్యం

పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛ దీపావళే లక్ష్యంగా పండుగ చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. పర్యావరణ అనుకూలమైన బాణసంచా, దీపాలు, కొవ్వొత్తులు ఉపయోగించాలని సూచించారు. తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య పరిశీలించి దుకాణదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు 720 మంది


మొగరాల జడ్పీహైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పాకాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని ఉన్నత పాఠశాలల్లో శనివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు 720 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాఠశాలస్థాయిలో జరిగిన పరీక్షలు రాశారు. ప్రతి తరగతి నుంచి ప్రథమ స్థానం సాధించిన ఒక్కో విద్యార్థిని ఎంపిక చేసి ముగ్గురు విద్యార్థులతో కూడిన జట్టుకు మండల స్థాయిలో నవంబరు 1వ తేది జరిగే పరీక్షకు పంపుతామన్నారు. మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు వేర్వేరుగా పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు వనపర్తి వెంకటసిద్ధులు, ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో పర్యావరణాన్ని కాపాడుకుందాం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

భాకరాపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా పెట్టుకుని పర్యావరణాన్ని కాపాడు కుందామని తహసీల్దారు భాగ్యలక్ష్మి అన్నారు. చిన్నగొట్టిగల్లులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్రలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్లను విరివిగా పెంచాలన్నారు. స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరిం టెండెంట్ సతీశ్‌కుమార్, ఆర్‌ఐ జానకిరాం, కార్యదర్శి వెంకటేశులు, విస్స్ కో-ఆర్డినేటర్ రహంతుల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భవితస్కూల్‌కి రూ.25వేల విరాళం


రూరల్ ఎంఈవో-2 శంకరయ్యకి నగదుని అందిస్తున్న అరుణ

తిరుపతిరూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని భవిత కేంద్రం స్కూల్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి అరుణ, దిలీప్ దంపతులు రూ.25వేల విరాళాన్ని అందించారు. ఈమేరకు శనివారం ఎంఈవో-2 శంకరయ్యకి ఈ నగదును అందించారు. ఉషారాణి, సుప్రజ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర



తిరుపతిరూరల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. చెత్త, వ్యర్థాలను ఇంటింటికీ వచ్చే గ్రీన్ అంబాసిడర్లకి ఇవ్వడం, పచ్చదనం-పరిశుభ్రత, ఇంటిపరిసరాల్లో పిచ్చిమొక్కలు తొలగించడం వంటివాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనా ర్యాలీ నిర్వహించి ప్రజల్ని చైతన్యపరిచారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ బి.గోపాల్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ పి.వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కేశవులశెట్టి, సుబ్రమణ్యం, వెంకటేష్‌నాయుడు, మనోహర్, లక్ష్మీనారాయణ, యోగానందరెడ్డి, సంఘమిత్ర పద్మమ్మ, డ్వాక్రా సంఘ సభ్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతను సద్వినియోగం చేసుకోండి

రామచంద్రాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజలు వారపు సంతను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు కోరారు. కమ్మపల్లి గ్రామంలో శనివారం నూతనంగా వారపు సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయాలను ప్రతి శనివారం సంతలో విక్రయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సతీష్, ఝాన్సీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమ్య, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నీలకంఠ చౌదరి, నాయకులు మధుసూదన్, మునిరత్నంనాయుడు, భక్తవత్సలంనాయుడు, ప్రకాష్, హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.


వారపు సంతను ప్రారంభిస్తున్న చిన్నబాబు



పవిత్రాలను తీసుకొస్తున్న పండితులు - ఆలయ మాడ వీధుల్లో తిరుచ్చిపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

వైభవంగా పవిత్రాల సమర్పణ

చంద్రగిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రెండోవ రోజైన శనివారం పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయం లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పవిత్ర సమర్పణ చేశారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, మూలవర్లకు అభిషేకం, తోమాల సేవ, కొలువు పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను కల్యాణ మండపం లోని యాగశాలకు వేంచేపు చేశారు. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రానాయనం నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు ఆలయంలోని మూలవర్లకు ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వామి అమ్మవార్లు విశేషంగా అలంకరించి తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు యాగశాల వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనంభట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, పార్థసారధి, శేషాచార్యులు నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డెయిరీ టెక్నాలజీలో ఘనంగా ఫ్రెషర్స్‌డే

తిరుపతిరూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ కోర్సులో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు శనివారం ఆరంభ్-2కే25 పేరిట ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. అలాగే విద్యార్థులకు కోర్సు పాఠ్యప్రణాళిక, కళాశాల నియమ, నిబంధనలు, వ్యక్తిత్వవికాసం పెంపు వంటి అంశాలపై 15రోజుల పాటు దీక్షారంభం పేరిట నిర్వహించిన ఓరియెం టేషన్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ జి.గంగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జేవీరమణతో డెయిరీ డీన్ ప్రొఫెసర్ కె.నాగేశ్వరరావు, డీఎస్ఏ ప్రొఫెసర్ వి.వైకుంఠరావు హాజరై ప్రారంభించి మాట్లాడారు. డెయిరీ కోర్సులు చదివిన వారికి పాడి పరిశ్రమరంగాలలో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అకడమిక్ విద్యతోపాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. విద్యాపరంగా జూనియర్లకు తలెత్తే సందేహాలను సీనియర్ విద్యార్థులు నివృత్తి చేసి మార్గదర్శకంగా వ్యవహరిం చాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభచాటిన విద్యార్థులకు బహు మతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ ఆర్వీ సురేష్‌కుమార్, డీఈ ప్రొఫెసర్ శోభామణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జీఎస్ స్ఫూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న వీసీ జేవీరమణ, పక్కన నాగేశ్వరరావు, వైకుంఠరావు తదితరులు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

● కారు ఢీకొని భవన నిర్మాణ కార్మికుడు..


మృతి చెందిన రుద్రప్రసాద్

చంద్రగిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. శుక్రవారం రాత్రి 10.30 గంటలకు మామండూరు వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో ఒడిశాకు చెందిన రుద్రప్రసాద్(31) మృతి చెందాడు. అతను చెన్నైలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మదనపల్లెకు వెళ్లేందుకు మామండూరు వద్ద రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న కారు ఢీకొంది. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రగిరి పోలీసులు అక్కడికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్ చక్రానికి చీర చుట్టుకుని మహిళ..


మృతి చెందిన సంపూర్ణమ్మ

పాకాలకు చెందిన శ్రీరాములు భార్య సంపూర్ణమ్మ(59) శనివారం ఉదయం తిరుపతికి వెళుతుండగా చంద్రగిరి మండలం ముంగిలిపట్టు-కోదండరామాపురం మధ్యలో స్కూటర్ చక్రానికి చీర చుట్టుకుని కిందపడింది. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు, ఎల్లుండి కేదారి గౌరీవ్రతం

తిరుపతిరూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీదేవి ఆలయంలో ఈ నెల 20, 21తేదీల్లో రెండ్రోజుల పాటు కేదారిగౌరీవ్రత (నోములు) పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి వెల్లడించారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.32 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,675
తలనీలాలు సమర్పించినవారు: 24,681

ప్రణాళికలు ఆచరిస్తే విజయాలు తథ్యం..!

- చదలవాడ రమణమ్మ ట్రస్టీ మెంబర్ వరుణ్‌సాయి



మాట్లాడుతున్న వరుణ్‌సాయి, పక్కన చదలవాడ కవిత, సాహితి తదితరులు

తిరుపతిరూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందిం చుకుని ఆచరిస్తే విజయాలు వాటంతట అవే దరి చేరుతాయని చదలవాడ రమణమ్మ ట్రస్టీ మెంబర్ వరుణ్‌సాయి పేర్కొన్నారు. రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ ఏడాది విద్యార్థులకు జెనెసిస్-2కే25పేరిట శనివారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిదశ ఎంతో కీలకమని, అంకితభావం, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో తమలక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు. అధునాతన సాంకేతికత, నైపుణ్యాలను పెంచుకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. పోటీ ప్రపంచంలో విద్యా వ్యవస్థల్లో సమూలమైన మార్పులు వచ్చాయని అందుకనుగుణంగా భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుని ఆచరించాలన్నారు. ట్రస్టీ మెంబర్ చదలవాడ కవిత మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి టెక్నికల్, సాఫ్ట్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంచుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సి పాల్, డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ పటేల్ మాట్లాడుతూ అధునాతన సాంకేతికతని అందిపుచ్చుకుని సరికొత్త పరిశోధనలు ఆవిష్కరించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాహితి, రంగనాథం, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సంజీవరాయుడు, హెడ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదరన్ డిస్కం సీఎండీకి సీవీవో అభినందనలు



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం సీఎండీగా ఐఏఎస్ అధికారి ఎల్.శివశంకర్ బాధ్యతలు తీసుకున్న అనంతరం శనివారం తొలిసారిగా ఆ సంస్థ చీఫ్ విజిలెన్స్ అధికారి కె.జనార్ధన్ నాయుడును కలసి అభినందనలు తెలిపారు.

పారిపోయి వచ్చిన విద్యార్థి : కుటుంబసభ్యులకు అప్పగింత


విద్యార్థి అఖిలేశ్వర్‌రెడిని మేనమామ భాస్కర్‌రెడ్డికి అప్పగిస్తున్న పోలీసులు

తిరుమల, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ప్రిన్సిపాల్ మందలించాడని పారిపోయి తిరుమలకు చేరుకున్న ఇంటర్ విద్యార్థిని శనివారం తిరుమల పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. హైదరాబాద్ మల్కాజిగిరికి చెందిన అఖిలేశ్వర్‌రెడ్డి(17) ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నాడు. నాలుగురోజులుగా కాలేజీకి రావడంలేదని ప్రిన్సిపల్ విద్యార్థి తండ్రికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. ఇంట్లో మందలిస్తారనే భయంతో అఖిలేశ్వర్‌రెడ్డి తిరుమలకు వచ్చేశాడు. ఆలయ పరిసరాల్లో ఒంటరిగా తిరుగుతున్న అఖిలేశ్వర్‌రెడ్డిని పోలీసులు గుర్తించి వివరాలు తెలుసుకుని కటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి అప్పగించారు.

ముద్ర నారాయణతో జేబీ వాగ్వాదం



తిరుపతి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి: డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, టీడీపీ నాయకుడు జేబీ శ్రీనివాస్ మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న 14వ డివిజన్‌లో ఓ భవన నిర్మాణం అనుమతులకు సంబంధించి యజమానిని టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి ఇబ్బంది పెడుతున్నట్టు తెలిసింది. దీనిపై జేబీ వర్గీయులు పలుమార్లు డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ మొండిగా వ్యవహరించినట్టు సమాచారం. ఈక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం నెహ్రూ మున్సిపల్ స్కూల్ మైదానంలో జరిగిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం అతిథులు వెళ్లినతర్వాత సదరు వివాదానికి సంబంధించి ఇరువురు మాటలు కలిపారు. ఇళ్లు నిర్మించుకుంటున్నవారిని ఇబ్బంది పెట్టడం మంచిదికాదని, అధికార పార్టీలో ఉన్నవారిపై కూడా ఇష్టమొచ్చినట్టు వ్యవహరించడం సరికాదని జేబీతో పాటు అనుచరులు హెచ్చరించినట్టు తెలిసింది.

హథీరాంజీ మఠం భవనాలు కూల్చవద్దు

● ఆస్తుల పరిరక్షణకు బోర్డు ఏర్పాటు చేయాలి ● మాజీ ఎంపీ సీతారాం నాయక్

తిరుపతి (కల్చరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : హథీరాంజీ మఠం భవనాలను కూల్చవద్దని హథీరాం బావాజీ పరిరక్షణ సమితి తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ సీతారాం నాయక్ కోరారు. ఈ భవనాలు బంజారాల ఆత్మ గౌరవానికి ప్రతీకగా పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ మఠం భవనాలను కూల్చాలనే నిర్ణయానికి తాము పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఆలోచించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలతో చలో తిరుపతికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. తమ భాషకు లిపిలేని కారణంగా వెనుకబాటు తనంలో ఉన్నామని తెలిపారు. మఠం ఆస్తుల పరిరక్షణకు బోర్డు ఏర్పాటు గురించి ప్రభుత్వాలు పట్టించు కోకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక మాజీ మంత్రి బాబురావు చౌహాన్, తెలంగాణా మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మహారాష్ట్ర మాజీ ఎంపీ హరిభవ్ రాథోడ్, తెలంగాణా ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కిషన్ సింగ్, తెలంగాణా మాజీ ఎమ్మెల్సీ రాహుల్ నాయక్, ఏపీ ఏబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, అశోక్ రాథోడ్, రవినాయక్, రవీంద్ర నాయక్, నారాయణ నాయక్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో కేంద్రమంత్రి



తిరుమల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి ఎల్.మురుగన్, ఎమ్మెల్యే కళా వెంకట్రావ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

● అభినందన



జేసీగా నియమితులైన కమిషనర్ మౌర్యను డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, లావణ్య లామినేషన్ అధినేత శంకర్ నాయుడు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

టీటీడీ ముద్రణాలయంలో ఆయుధపూజ

తిరుమల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదురుగా ఉన్న ముద్రణాలయంలో శనివారం ఆయుధపూజ జరిగింది. టీడీపీ, ఆఫ్‌సెట్, మిషన్ సెక్షన్, ఆర్టిస్టు, బైండింగ్ విభాగాల్లోని యంత్రాలకూ ఆయుధపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ముద్రణాలయం డిప్యూటీఈవో విజయ్‌కుమార్, పీఆర్వో నీలిమ, యూనియన్ నాయకులు శ్రీనివాసన్, శ్రీనివాసులు, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మంగళం విద్యార్థులు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వడమాలపేట ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ అండర్- 17, 19పోటీలలో మంగళం ట్రెండ్స్ ఉన్నతపాఠశాల క్రీడాకారులు సత్తాచాటారు. వీరిలో అండర్ -19విభాగంలో జీవిత, ప్రీతి, శశిపాండు, అభిషేక్, నవీన్, అండర్- 17విభాగంలో ప్రియా, అభినయ ఉన్నారు. వీరు ఈనెల 23న గుంటూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో తలపడనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను ఎంఈవో భాస్కర్‌నాయక్, దండు రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.


వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కలెక్టర్‌ను కలిసిన మత్స్యశాఖ జేడీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శాంతి

తిరుపతి (కలెక్టరేట్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్‌ను జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ (ఇన్‌ఛార్జి) కె.శాంతి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

న్యూమంగళంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర


శెట్టిపల్లి గ్రామంలో ర్యాలీ చేస్తున్న పంచాయతీ అధికారులు, సిబ్బంది

తిరుపతి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): న్యూమంగళం గ్రామ సచివాలయం ముందు శనివారం ఉదయం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించారు. చుట్టుపక్కల, వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. కాలువలను శుభ్రం చేశారు. అనంతరం కార్యదర్శి మురళి పంచాయతీ సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జె.వీరమ్మ, ఉప సర్పంచ్ కె.రామకృష్ణ, బిల్ కలెక్టర్ మునికృష్ణ, టీడీపీ నాయకులు వేమూరు గోపాల్‌యాదవ్, మాతయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ● మంగళం క్వార్టర్స్, తిరుమలనగర్ గ్రామపంచాయతీల్లో కార్యదర్శి మనోజ్‌కుమార్, సప్తగిరికాలనీ, రణధీరపురం గ్రామపంచాయతీల్లో సెక్రటరి శశిభూషణ్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

ఎస్పీకి దీపావళి శుభాకాంక్షలు


ఎస్పీని కలసి శుభాకాంక్షలు చెబుతున్న హోటల్ యజమానులు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్పీ సుబ్బరాయుడుకు తిరుపతి హోటల్ అసోసియేషన్ నాయకులు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఎస్పీని హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలిసి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ చౌదరి, హోటల్ అసోసియేషన్ నాయకులు చిల్లీస్ అంజి, రిగాలియా హోటల్ నితిన్ చక్రవర్తి, లోకేష్, కుమారస్వామిరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, ఓరియన్ శ్రీనివాస్, గ్రీన్ మెరీడియన్ చంద్రశేఖర్ ఇతర హోటల్ యజమానులు ఉన్నారు.

తిరుమలలో శరభయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి

యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి వెంకటాద్రి యాదవ్


విగ్రహ నమూనా ముద్రణ కరపత్రాలను ప్రదర్శిస్తున్న యాదవ సంఘం నాయకులు

తిరుపతి (కల్చరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శరభయ్య యాదవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడుతూ యాదవ సత్రం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఆ మేరకు ఇప్పటికే టీటీడీ అధికారులకు, పాలకమండలి సభ్యులకు విన్నవించినట్లు తెలిపారు. అనంతరం శరభయ్య విగ్రహ నమూనా కరపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు హేమంత్ యాదవ్, మునస్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

స్వచ్ఛ దీపావళి

● క్రాకర్స్ కాలుష్యం తగ్గించేందుకు అవగాహన

● కొత్త నిర్మాణాలకు సోలార్ అనుమతి తప్పనిసరి

● స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రలో అధికార యంత్రాంగం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దీపావళి టపాసుల వల్ల కలిగే గాలి కాలుష్యాన్ని తగ్గించ డమే ఈ నెల ప్రధాన లక్ష్యమని, స్వచ్ఛ దీపావళి- గ్రీన్ దీపావళి అని మనమందరం పర్యావరణ అనుకూలమైన దీపాలు, కొవ్వొత్తులను ఉపయోగించుకోవాలని, కాలుష్య నివారణ దిశగా ప్రజలు ముందుకు సాగాలని అధికార యంత్రాంగం పిలుపునిచ్చింది. ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పా టు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గాలి కాలుష్యం తగ్గించడానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించి ప్రతిఒక్కరూ మొక్కలను పెంచాలని తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ మౌర్య మాట్లాడుతూ దీపావళి వేళ టపాసుల వల్ల కలిగే గాలి కాలుష్యాన్ని తగ్గించడమే ఈ నెల ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి వార్డులో క్రాకర్ పొల్యూషన్ తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరంలోని కొత్త భవనాల అనుమతులలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటు తప్పనిసరి చేశారని వెల్లడించారు. అనంతరం నెహ్రూ మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీసీ చైర్మన్ సుగుణ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్ నారాయణ, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్, ఎస్సీ కార్పొరేషన్ మెంబర్ కుమారమ్మ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా హాథీరాం బావాజీ బర్సీ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న బంజారా సంఘ నాయకులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠంలో శనివారం హథీరాం బావాజీ 4978వ బర్సీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్య క్రమానికి దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల నుంచి వివిధ మఠాధిపతులు, బంజారా సంఘాల నాయకులు, మఠం పరిరక్షణ సమితి నాయకులు పెద్దయెత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా బోగ్ బండారా కార్యక్రమం నిర్వహించారు. హథీరాం బావాజీకి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో బంజారా సంఘాల నాయకులు, వివిధ మఠాధిపతులు మాట్లాడుతూ శ్రీవారి భక్తునిగా హథీరాంజీ జీవిత విశేషాలను వివరించారు. తర్వాత శోభాయాత్రగా తిరుమలకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో హథీరాం బావాజీ మహాసంఘ్ అధ్యక్షులు అమృత నాయక్, కార్యక్రమం అధ్యక్షులు కృష్ణనాయక్, ప్రసాద్, రమేష్ నాయక్, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.



విశ్వం అవగాహనా సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణలో జాతీయ స్థాయి అగ్రగామి శిక్షణా సంస్థగా విశ్వం విద్యాసంస్థలు నిలిచాయని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల కేంద్రంలో సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై అవగాహన సదస్సు శనివారం జరగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లుగా విశ్వం విద్యా సంస్థలు సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాలల ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అగ్రస్థానాలు సాధిస్తోందని చెప్పారు. 2025 ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు సాధించడం విశ్వం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల చివరి తేదీ అక్టోబరు 30 అని వెల్లడించారు. 4వ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్ తదితర వివరాలకు వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రంలోగాని, 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లలోగాని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




మీడియాతో మాట్లాడుతున్న క్రైం అదనపు ఎస్పీ

ఐదుగురు దొంగల అరెస్టు

బంగారు నగలు, నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల బ్యాగుల నుంచి బంగారు నగలు, నగదు చోరీ చేసే ఐదుగురు దొంగలను తిరుపతి క్రైం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు నగలు, మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా బండ్లవీధికి చెందిన కందన్‌సాయి, కొండరాజుపల్లికి చెందిన కొండరాజు రత్తయ్య కొంత కాలంగా వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్లు దొంగలించి విక్రయించేవారు. వీరితో పాటు ఎస్. జ్యోతి, వి.నందిని, ఏ. ప్రియ ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల బ్యాగులు చోరీచేసేవారు. వీరిపై విశాఖపట్నం, మల్కాపురం, కోడూరు, అలిపిరి, తమిళనాడు, సోమల, తిరుపతి, పుత్తూరు, గాజులమండ్యం, పాకాల, కార్వేటినగరం, కడప, నెల్లూరు జిల్లాల్లో కేసులు నమోదై ఉన్నాయి. ఈ క్రమంలో జయశ్యామ్ థియేటర్ వద్ద ముగ్గురు మహిళా నిందితులను, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండులో మోటారు సైకిల్ దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు కేసులకు సంబంధించిన సొత్తులు రికవరీ చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన సీఐలు, ఎస్ఐలను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

10 వేల సోలార్ కనెక్షన్లతో

నెంబర్‌వన్‌గా నిలుద్దాం

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



సూర్యఘర్ పథకం బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, విద్యుత్ అధికారులు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యఘర్ పథకం కింద తిరుపతిలో 10 వేల సోలార్ కనెక్షన్లు ఇచ్చి నెంబర్ వన్‌గా నిలుద్దామని ఇందుకు అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆయన అధికారులతో కలిసి ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ప్యానల్‌పై ఉన్న 12శాతం జీఎస్టీ 5శాతానికి తగ్గించారన్నారు. దీనివల్ల ప్రతి లక్ష రూపాయలకు రూ.4,900లు తగ్గుతుందన్నారు. సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకొనే వారికి కేంద్ర ప్రభుత్వం రూ.78వేల రాయితీ కూడ మంజూరు చేస్తుందని వివరించారు. సోలార్ కనెక్షన్ తీసుకున్నవారికి బ్యాంక్‌లు రుణసదుపాయం కల్పిస్తాయని తెలియజేశారు. మన వద్ద మిగులు విద్యుత్‌ను విద్యుత్ సంస్థ కొనుగోలు చేసి నగదు చెల్లిస్తుందని వివరించారు. అంతకు ముందు సోలార్ రూఫ్ టాప్ విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వి.చంద్రశేఖర్‌రావు, ఈఈలు సి.గంగాధర్‌రెడ్డి, ఫుల్లా బాలాజీ, విశ్రాంత ఎస్ఈ ఎస్. ముని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎఫ్‌వో



మంగళం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబా శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కర్నూలు జిల్లా ఆత్మకూరు డీఎఫ్‌వోగా ఆయన పనిచేశారు.



ఈవోలో లోపించిన జవాబుదారీతనం

● శివ కామేశ్వరి శక్తిపీఠం ధర్మాచార్య శివానందస్వామి

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవోలో జవాబుదారీతనం లోపించిందని తెలంగాణలోని శివకామేశ్వరి శక్తి పీఠం ధర్మాచార్య శివానంద స్వామి ఆరోపించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడుతూ ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి తిరుమల శ్రీవారి బ్రేక్ దర్శన టిక్కెట్లను విక్రయించడంపై విచారణ జరిపించాలనే విషయమై ఈవోను కలిసేందుకు వెళ్లగా అనుమతి ఇవ్వలేదన్నారు. అపాయింట్‌మెంట్ ఉంటే కానీ వీలు కాదని అక్కడి సిబ్బంది చెప్పడం ఆశ్చర్యం కలిగిం చిందని తెలిపారు. ఈవో భక్తులకు అందుబాటులో ఉండాలని లేనిపక్షంలో భక్తుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. అనీల్‌కుమార్, తిరుపాల్, జయరామిరెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


తిరుపతిలో శనివారం ధన్వంతరి జయంతి సంజీవని స్వరం శోభాయాత్రకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు మాధవ్, రామచంద్రరావును సత్కరిస్తున్న బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

23న తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో వేలం

తిరుపతి (కల్చరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈ నెల 23వ తేదీ ఉదయం 11గంటలకు వివిధ పనులకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ మహేష్‌యాదవ్, ఈవో జయకుమార్ శనివారం తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలు, కొబ్బరి చిప్పలు సేకరించుకోవడానికి, వెయ్యికళ్ల దుత్తల విక్రయానికి, సజీవ కోళ్ల సేకరణకు, పాదరక్షల రుసుము వసూలు హక్కులకు సంబంధించి వేలం నిర్వహి స్తున్నట్లు చెప్పారు. ఏడాది కాలానికి నిర్వహించే బహిరంగ వేలంలో ఆసక్తిగల వారు పాల్గొన వచ్చని విజ్ఞప్తిచేశారు.



పుత్తూరు వార్తలు

ఉపాధి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

● మండల మీట్‌లో సభ్యుల ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్ రెడ్డి

వడమాలపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన సిమెంట్ రోడ్లు, గోకులం షెడ్లకు బిల్లుల చెలింపులో జాప్యంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వడమాలపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగింది. జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ... మండలంలో 61 గోకులం షెడ్లు, 33 సిమెంట్ రోడ్ల నిర్మాణం జరిగితే, మొదటి విడత బిల్లులు మాత్రమే చెల్లించారన్నారు. 909 పక్కాగృహాలు మంజూరు కాగా 605 పూర్తైనట్టు హౌసింగ్ ఏఈ తెలిపారు. వడమాలపేట ఆరోగ్య కేంద్రంలో అన్నిరకాల పరీక్షలు చేస్తున్నట్టు సీహెచ్‌వో పురుషోత్తం రెడ్డి తెలిపారు. మండలంలో 9101 మందికి స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేసినట్టు కృష్ణమ్మ తెలిపారు. వర్షాకాలంలో రోగాలు ప్రబలకుండా కార్యదర్శులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో హరినాథబాబు ఆదేశించారు. గూళూరు చెరువు తూములకు మరమ్మతులు చేయాలని ఎస్బీఆర్ పురం సర్పంచ్ మణిరాజు కోరారు.

సజావుగా మండల మీట్

ఎంపీపీపై ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రకటించడంతో శనివారం మండల మీట్ నాటకీయ పరిణామం మధ్య సజావుగా సాగింది. ఏడుగురు వైసీపీ సానుభూతిపరులు ఎంపీటీసీ సభ్యులుగా ఉన్నారు. తిరుమణ్యం, ఎస్‌బీఆర్ పురం ఎంపీటీసీ సభ్యులు రవి, కనకమ్మ సమావేశానికి హాజరయ్యారు. దీంతో కోరం ఉండడంతో సమావేశం సజావుగా కొనసాగింది. సీఐ రవీంద్ర, ఎస్ఐ ధర్మారెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ప్రసన్న వెంకన్నకు అభయ, కటిక హస్తాల వితరణ



వడమాలపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామికి తిరుపతికి చెందిన మోహన్, లావణ్య దంపతులు అభయ, కటిక హస్తాల ను వితరణ చేశారు. శనివారం సుమారు రూ 3.50 లక్షల విలువైన 1.624 కిలోల వెండి హస్తాలను ఆలయ అధికారి వేణుగోపాల్‌కు అందజేశారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

వడమాలపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు నిత్యం పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యకరంగా ఉంటారని టాటా ట్రస్ట్, విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రాం అసోసియేట్ సంతోషి చెప్పారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినం సందర్భంగా తడుకు ఆర్ఎస్, ఎస్వీపురం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆర్థిక సాయం

వడమాలపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుటుంబానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. వడమాలపేట ఏఎడబ్ల్యూకు చెందిన భార్యభర్తలు వేణుగోపాల్, అలేఖ్య రోడ్డు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం వారిని పరామర్శించి సాయం అందజేశారు.

భక్త జనసంద్రం... ప్రసన్న వెంకన్న ఆలయం


దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు


దేవేరులతో శ్రీవారి ఊరేగింపు

వడమాలపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం పెరటాశి చివరి శని వారాన్ని పురస్కరించుకుని భక్త జన సంద్రమైంది. అంతకుముందు వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో వెంకన్నను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలపై అధిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లు మాడ వీధుల్లో విహరించగా భక్తులు దర్శించుకున్నారు. శనివారం 18 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు సూపరింటెంటెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి వేణుగోపాల్ చెప్పారు. కాగా స్వామివారికి తలనీలాలు సమర్పించడానికి వచ్చిన భక్తులు గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కమిటీల ఏర్పాటుపై మాజీ మంత్రి రోజా సమీక్ష


కోటి సంతకాల పత్రాలతో వైసీపీ నాయకులు

పుత్తూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):వైసీపీ బలోపేతం, కమిటీల ఏర్పాటు తదితరాలపై పట్టణంలోని ఓ కల్యాణమంపంలో మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేయాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాలను సేకరించాలని దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద ఆర్టీఐ కమిషనర్ సునీల్



శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శనివారం ఆర్టీఐ కమిషనర్ సునీల్, సినీ సంగీత దర్శకురాలు ఎం.ఎం. శ్రీలేఖ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

జీఎస్టీ 2.0తో అన్ని వర్గాలకు ప్రయోజనం: కురుగొండ్ల


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై శనివారం డక్కిలిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. డక్కిలిలోని దేవునివెల్లంపల్లి రోడ్డు సెంటరు నుంచి కమ్మపల్లి రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. దుకాణాల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేసి జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం డక్కిలి సచివాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో రవీంద్రబాబు, ఎంఈవో జగదీష్, ఎస్ఐ శివశంకర్, ఏపీవో కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కిలి పట్టణ అధ్యక్షుడు చంద్రారెడ్డి, మోపూరు, దగ్గవోలు, లింగసముద్రం సొసైటీల అధ్యక్షులు పులి జనార్దనరెడ్డి, ఈతముక్కల సురేంద్ర, రంగినేని రాజా, టీడీపీ నాయకులు చెలికం నారాయనరెడ్డి, దందవోలు పెంచలరెడ్డి, డక్కిలి సునీల్ రెడ్డి, పోకూరు రమేష్, పీపీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఉపాధ్యక్షుడికి పరామర్శ

పెళ్లకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన నాయుడుపేట ఏఎంసీ ఉపాధ్యక్షుడు కిలారి గోపిని పలువురు టీడీపీ నాయకులు శనివారం పరామర్శించారు. గోపి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇటీవల చికిత్స తీసుకున్నారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, గంగాబత్తిన రామకృష్ణ, సన్నాడి వేణురెడ్డి తదితరులు పరామర్శించారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దారు, సర్వేయరు

కోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి శనివారం అధికారులు స్థలాలను పరిశీలించారు. తహసీల్దారు జయజయరావు, మండల సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్‌వో రమణయ్య ఆర్టీసీ బస్టాండు సెంటర్, ఆర్ఆర్ థియేటర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు.

ఎస్పీని కలిసిన టీడీపీ నేత

డక్కిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మధవనాయుడు శనివారం ఎస్పీ సుబ్బరాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచల నర్సయ్య ఉన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎఫ్‌వో

మంగళం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబా శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కర్నూలు జిల్లా ఆత్మకూరు డీఎఫ్‌వోగా ఆయన పనిచేశారు.

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర


మొక్కలు నాటుతున్న మున్సిపల్ అధికారులు

సూళ్లూరుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని అన్ని వార్డుల్లో పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఓజిలి: స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంపై ఓజిలిలో ఎంఈవో శైలజ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో, తహసీల్దారు, ఎంఈవో, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టపాసుల దుకాణదారులు నిబంధనల మేరకే విక్రయాలు జరపాలని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జయజయరావు అన్నారు. శనివారం కోట, విద్యానగర్‌లోని టపాసుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ప్రయాణికులకు పాదచారులకు, వాహనచోదకులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా టపాసుల విక్రయాలు జరపాలన్నారు. ఎక్కడైన లోపాలు జరిగినట్లు తెలిస్తే సంబంధిత దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగు తుందని హెచ్చరించారు. ఇప్పటి వరకు 15టపాసుల దుకాణాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్‌రావు, అగ్నిమాపక అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం భవనాలను కూల్చొద్దు

● ఆస్తుల పరిరక్షణకు బోర్డు ఏర్పాటు చేయాలి

● మాజీ ఎంపీ సీతారాం నాయక్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాం నాయక్

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం భవనాలను కూల్చవద్దని హథీరాం బావాజీ పరిరక్షణ సమితి తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ సీతారాం నాయక్ కోరారు. ఈ భవనాలు బంజారాల ఆత్మ గౌరవానికి ప్రతీకగా పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ మఠం భవనాలను కూల్చాలనే నిర్ణయానికి తాము పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఆలోచించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలతో చలో తిరుపతికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. తమ భాషకు లిపిలేని కారణంగా వెనుకబాటు తనంలో ఉన్నామని తెలిపారు. మఠం ఆస్తుల పరిరక్షణకు బోర్డు ఏర్పాటు గురించి ప్రభుత్వాలు పట్టించు కోకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక మాజీ మంత్రి బాబురావు చౌహాన్, తెలంగాణా మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మహారాష్ట్ర మాజీ ఎంపీ హరిభావ్ రాథోడ్, తెలంగాణా ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కిషన్ సింగ్, తెలంగాణా మాజీ ఎమ్మెల్సీ రాహుల్ నాయక్, ఏపీ ఏబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, అశోక్ రాథోడ్, రవినాయక్, రవీంద్ర నాయక్, నారాయణ నాయక్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా హరిప్రసాద్

బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐగా హరిప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన విశ్వనాథ నాయుడు ఇటీవల పదవీ విరమణ చేయడంతో తిరుపతి వీఆర్‌లో ఉన్న హరిప్రసాద్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

పాఠశాలను విలీనం చేయొద్దు

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని పాఠశాలను విలీనం చేయవద్దని వేడాం పంచాయతీలోని పెద్దమిట్టకండ్రిగవాసులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని పాఠశాలను 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నమిట్టకండ్రిగలోని పాఠశాలలో విలీనం చేశారన్నారు. పాఠశాలకు వెళ్లే దారిలో పెద్ద వరవ కాలువ ఉందని, వర్షాకాలంలో పిల్లలు పాఠశాలకు చేరుకోవడానికి ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. మురగారెడ్డి, జానకమ్మ, నాగరాజురెడ్డి, కుప్పారెడ్డి, వజ్రవేలు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యమైన జీవనం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యమైన జీవనం సాధ్యమని ఆరోగ్య అధికారి డీఎస్ వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ అంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బీఎన్‌కండ్రిగ పట్టణంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సురేష్ నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో చెత్త తొలగింపు


స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈవో

కేవీబీపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుల కండ్రిగ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంఈవో ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో చెత్తను తొలగించారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యదర్శి గోవిందస్వామి, హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు గుణశేఖర్, మధుశేఖర్, మాధురి, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శనిత్రయోదశి పూజలు


నందీశ్వరుడికి పాలాభిషేకం - జిల్లా జడ్జికి స్వాగతం

నాగలాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయంలో శనివారం శని త్రయోదశి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుకుల్ పంచామృతాభిషేకం నిర్వహించారు. వివిధ పుష్పాలతో అలంకరించిన అనంతరం మహా, కుంభ, నక్షత్ర హారతులు చేపట్టారు. అనంతరం మరకదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి ఉత్సవర్లను సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ పద్మనాభరాజు, సభ్యులు నెల్సన్ మండేలా, శ్రీనివాసులునాయుడు, నాగభూషణమ్మ, హంస, జయంతి,దేవి, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా పళ్లికొండేశ్వర ఆలయాన్ని శనివారం జిల్లా న్యాయమూర్తి అరుణసారిక సందర్శించారు. ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో జిల్లా జడ్జికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు కల్పించారు.


స్వామి, అమ్మవార్ల ఊరేగింపులో పాల్గొన్న శంకర్‌రెడ్డి

ప్రభుత్వాస్పత్రిలో ఎక్స్‌రే మెషిన్

ఎమ్మెల్యే చొరవతో ఐదేళ్ల తరువాత అందుబాటులోకి


ప్రభుత్వాస్పత్రిలో ఉన్న అధునాతన ఎక్స్ రే మెషిన్

సూళ్లూరుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో గత ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఎక్స్ రే మెషిన్ ఎట్టకేలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. నియోజకవర్గ కేంద్రమైన ప్రభుత్వాస్పత్రికి 2020లో స్వర్ణ టోల్‌ప్లాజా యాజమాన్యం కార్పొరేట్ బాధ్యత కింద అధునాతన ఎక్స్ రే మెషిన్ అందజేసింది. అయితే ఆస్పత్రిలో ఉన్న ఎక్స్ రే మెషిన్ గదితో పాటు పలు విభాగాలకు విద్యుత్ సరఫరా లేకపోవడం వినియోగంలో లేదు. దీనిని గుర్తించి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ(హెచ్‌డీఎస్) సభ్యులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే స్పందించి ఎంస్ అగర్వాల్, సీసీఎల్ పరిశ్రమల సహకారంలో రూ.3.50 లక్షలతో విద్యుత్ వైరింగ్‌తో పాటు ఎక్స్ రే మెషిన్ గదిని ఆధునికీకరించి వినియోగంలోకి తెచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈనెల 22న ఎక్స్‌రే మెషిన్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి అధికారుల తెలిపారు.

అందరికీ సమ న్యాయం


దుకాణదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

కోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పంచాయతీ దుకాణాల వేలం పాటలకు సంబంధించి ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో ఏ ఒక్కరికీ రాయితీ ఉండదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. పంచాయతీకి చెందిన పలు దుకాణాలను వేలంపాటు నిర్వహించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో టీడీపీ నాయకుడు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి నివాసంలో శనివారం రాత్రి దుకాణదారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. నాలుగు దశాబ్దాలుగా పంచాయతీ దుకాణాలను నడుపుకుంటున్నామని, ఈ సారి వేలంపాటలు నిర్వహించకుండా తమకే దుకాణాలు అప్పగించి ఆదుకోవాలని ప్రస్తుత దుకాణాదారులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అందరికీ సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ఎలాంటి అపోహలకు తావు ఇవ్వొద్దన్నారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ పలగాటి భాస్కర్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, జలీల్‌అహ్మద్, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, సురేష్, మోహన్‌రెడ్డి, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు దొంగల అరెస్టు

బంగారు నగలు, నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం


మీడియాతో మాట్లాడుతున్న క్రైం అదనపు ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల బ్యాగుల నుంచి బంగారు నగలు, నగదు చోరీ చేసే ఐదుగురు దొంగలను తిరుపతి క్రైం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు నగలు, మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా బండ్లవీధికి చెందిన కందన్‌సాయి, కొండరాజుపల్లికి చెందిన కొండరాజు రత్తయ్య కొంత కాలంగా వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్లు దొంగలించి విక్రయించేవారు. వీరితో పాటు ఎస్. జ్యోతి, వి.నందిని, ఏ. ప్రియ ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల బ్యాగులు చోరీచేసేవారు. వీరిపై విశాఖపట్నం, మల్కాపురం, కోడూరు, అలిపిరి, తమిళనాడు, సోమల, తిరుపతి, పుత్తూరు, గాజులమండ్యం, పాకాల, కార్వేటినగరం, కడప, నెల్లూరు జిల్లాల్లో కేసులు నమోదై ఉన్నాయి. ఈ క్రమంలో జయశ్యామ్ థియేటర్ వద్ద ముగ్గురు మహిళా నిందితులను, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండులో మోటారు సైకిల్ దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు కేసులకు సంబంధించిన సొత్తులు రికవరీ చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన సీఐలు, ఎస్ఐలను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే సమాలోచన

పిచ్చాటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్‌తో సమాలోచన చేశారు. నియోజకవర్గంలో 17 పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.5.44 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని, తాగునీరు, పైపులైన్, శ్మశనానికి రోడ్డు, మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయ, సంబంధిత అధికారులతో వెంటనే పనులు పూర్తి చేయించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ డీడీ విక్రమ్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ఎమ్మెల్యేను కలసి జాబ్‌మేళా నిర్వహణ, సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధిపై చర్చించారు.

కరకంబాడిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

రేణిగుంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో రవిచంద్ర తెలిపారు. కరకంబాడి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రభురావు, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే రేణిగుంటలో సర్పంచ్ నాగేశం, కార్యదర్శి మాధవి, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంల స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది.

చేతుల శుభ్రతపై పోటీలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచగున్నేరి ప్రాథమిక పాఠశాలలో శనివారం విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుకు చేతుల పరిశుభ్రతపై చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ... భోజనానికి ముందు, తరువాత, మలవిసర్జన తరువాత చేతులను సబ్బుతో కడుక్కోవాలన్నారు. ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, కోఆర్డినేటర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని టీడీపీ నాయకులు అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో పురపాలక సంఘ అధికారులతో కలిసి మొక్కలను నాటారు. ఇళ్ల వద్దకు వచ్చిన పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని కోరారు. గుర్రప్పశెట్టి, డీవీ నారాయణ, ఆర్ముగం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

జాతీయస్థాయి అగ్రగామి శిక్షణ సంస్థ 'విశ్వం'

● అవగాహన సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణలో జాతీయస్థాయి అగ్రగామి శిక్షణా సంస్థగా విశ్వం విద్యాసంస్థలు నిలిచాయని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల కేంద్రంలో సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లుగా విశ్వం విద్యా సంస్థలు సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాలల ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అగ్రస్థానాలు సాధిస్తోందని చెప్పారు. 2025 ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు సాధించడం విశ్వం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల చివరి తేదీ అక్టోబరు 30 అని వెల్లడించారు. 4వ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్ తదితర వివరాలకు వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రంలోగాని, 8688888802 / 9399976999 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'నిజం మాట్లాడితే వైసీపీ వెయ్యి ముక్కలు'


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నిజం మాట్లాడితే వైసీపీ వెయ్యి ముక్కలు అవుతుందని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ... నిత్యం బూటకపు మాటలతో వైసీపీ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందన్నారు. నకిలీ మద్యం కేసులో అడ్డంగా దొరికిన మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి జోగి రమేష్, జనార్దన్ గ్యాంగు లింకు బయటపడడం దీనికి నిదర్శనన్నారు. జనార్దనరావు, ఆయన సోదరుగు జగన్మోహన్‌రావు తనకు తెలియదని బుకాయించిన జోగి రమేష్ వారితో ఉన్న ఫొటోలతో అడ్డంగా దొరికిపోయారన్నారు. నాటి వైసీపీ పాలనలో ఆర్థిక రాజధాని విశాఖపట్నం ప్రతిష్ఠ మసక బారగా నేడు కూటమి ప్రభుత్వ హయాంలో పరిశ్రమల రాకతో వెలుగులు విరజిమ్ముతోందన్నారు. దీనికి నిదర్శనమే విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవడమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ సంక్షేమ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, తంగేళ్లపాళెం పీఏసీఎస్ చైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, నాయకులు వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, చిల్లకూరు మణి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌తో రెడ్‌బుక్‌కు చెక్: బియ్యపు మధు



సమావేశంలో మాట్లాడుతున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రెడ్‌బుక్ ఆగడాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేద్దామని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అక్రమ అరెస్టులపై పోరాటం చేసేందుకు జగనన్న సైన్యం సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమష్టిగా పోరాటం చేద్దామన్నారు. అంతకుముందు గ్రామ, వార్డు, మండల కమిటీ నియామకాలపై పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, నాయకులు అంజూరు శ్రీనివాసులు, గిరిధర్ రెడ్డి, ఉన్నం వాసుదేవనాయుడు, షేక్ సిరాజ్ బాషా, విక్రుష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు



వరదయ్యపాళెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్మికులను తరలిస్తున్న ఆటోను ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో నలుగురు గాయపడ్డారు. శనివారం ఉదయం నాగనందాపురం, పాండూరుల నుంచి శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు కార్మికులను తరలిస్తున్న ఆటోను చిన్నపాండూరు పంచాయతీ వీకేఆర్‌పై కాలనీ సమీపంలో మలుపు వద్ద ప్రైవేట్ బస్సు ఢీ కొనింది. ఈ ఘటనలో ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలయ్యాయి. చంద్రమ్మ తీవ్రంగా గాయపడగా చిన్నపాండూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి, సత్యవేడుకు తరలించారు. ఆటో డ్రైవర్‌తోపాటు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈఘటనపై పోలీసులకు ఎలాంటి పిర్యాదు అందలేదు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ

నారాయణవనం, అక్టోబర్ 18(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్ల ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లకు ఊంజల సేవను నిర్వహించారు.

వర్షం... గ్రామీణ రోడ్లు ఛిద్రం


ఆర్ అనంతపురం, పూసలపల్లి దగ్గర చెరువును తలపిస్తున్న రోడ్లు - ధ్వంసమైన జీఎన్‌కండ్రిగ రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబుగోళం రోడ్డు వర్షాలకు ఛిద్రమైంది. శ్రీకాళహస్తి - తడ రోడ్డునుంచి 14 గ్రామాలను కలుపుతూ 15సంవత్సరాల క్రితం రోడ్డు నిర్మించారు. అయితే ఈ రోడ్డుకు ఇప్పటి వరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలమయమైంది. వర్షాలతో గుంతలు పెద్దవై చెరువును తలపిస్తోంది. ఆర్ అనంతపురం, జీఎన్‌కండ్రిగ, పూసలపల్లి సమీపంలో రోడ్డు కోతకు గురైంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఏర్పేడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు, గుండ్లకండ్రిగ, కుక్కల గుంటలకు వెళ్లే రహదారులు రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతలమయంగా మారాయి. ఈ మార్గంలో వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. గుంతలు తెలియక వాటిల్లో పడి వాహన చోదకులు గాయపడతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.


చెల్లూరు - గుండ్లకండ్రిగ, కుక్కలగుంటకు వెళ్లే రహదారుల దుస్థితి

కుండపోత వర్షం



శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 4నుంచి 8గంటల వరకు ఏకధాటిగా వాన కురిసింది. సాయంత్రం విద్యాసంస్థలు నుంచి రాకపోకలు సాగించేందుకు విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. లోతట్టు వీధుల్లో నీరు ప్రవహించింది. గాలులు లేకపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడలేదు.

వెలవెలబోయిన బాణసంచా దుకాణాలు

భారీ వర్షంతో బాణసంచా విక్రయాలు వెలవెలబోయాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వెనుక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో 14 దుకాణాల నిర్వహణకు అధికారులు లైసెన్సులు జారీ చేశారు. శనివారం నుంచి విక్రయాలు ప్రారంభమయ్యాయి. భారీ వర్షం కారణంగా తొలి రోజు వ్యాపారాలు నిరుత్సాహ పరిచాయి.

కోర్టు భవన నిర్మాణానికి స్థల పరిశీలన


స్థల పరిశీలనలో జిల్లా జడ్జి అరుణసారిక తదితరులు

సత్యవేడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మించనున్న కోర్టు భవన నిర్మాణానికి అనువైన స్థల పరిశీలనకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక శనివారం విచ్చేశారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వెంకట నాగరాజు, తహసీల్దార్ రాజశేఖర్ ఆమెకు స్వాగతం పలికారు. సత్యవేడులో ప్రస్తుతం నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ కోర్టు భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో అధునాతన కోర్టు భవన సముదాయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన స్థలంతో పాటు, కోర్టు నిర్మించే వరకు తాత్కాలిక భవనాన్ని జిల్లా జడ్జి పరిశీలించారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వాస్పత్రి అదనపు భవనం, మినీ క్రికెట్ స్టేడియం భవనాలను పరిశీంచారు. అనంతరం నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణానికి స్థానిక వారపు సంత వద్ద స్థలాన్ని పరిశీలించారు. కోర్టు నిర్వహణకు మినీ స్టేడియం భవనాన్ని, నూతన కోర్టు భవనం కోసం వారపు సంత స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిసింది. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ భారతి, సీఐ మురళి, ఎస్‌ఐలు రామస్వామి, వెంకటేశులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గోవర్ధనపురం వంతెనపై నీరు



వరదయ్యపాళెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శ్రీకాళహస్తి మార్గంలోని గోవర్ధనపురం వంతెనపై నీరు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపాటి వర్షాలకే ఈ పరిస్థితి తలెత్తిందని, కొత్త వంతెనను నిర్మించాలని కోరుతున్నారు.

దళితులకు భూ పట్టాలివ్వాలి

నారాయణవనం, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెత్తల తడకు దళితులకు భూ పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన వెత్తల తడుకు వద్ద భూ పోరాట కేంద్రాన్ని సీఐటీయూ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా 100 ఏకరాల ప్రభుత్వ భూమి వంద కుటుంబాలు సాగు చేస్తున్నప్పటికీ వారికి పట్టాలు ఇవ్వలేదన్నారు. ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి ఇచ్చిన ఆర్డర్‌ను కేవలం అగ్రకులాల వారికి మాత్రమే అమలు చేశారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్, నాయకులు వెంకటేష్, మునిశంకర్, మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో స్నేహపూరిత వాతావరణం ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

నారాయణవనం, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): కళాశాలలో సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య స్నేహపూరిత వాతావరణం ఉండాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర అన్నారు. శనివారం మండల పరిధిలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ పై అవగాహన సదస్సులో జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు పెట్టుకుని, దానికి తగిన విధంగా విద్యను అభ్యసించాలని హితవు పలికారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఆర్థికంగా ఎంతో కష్టాన్ని అనుభవిస్తుంటారని, వారి ఆశలను నేరవేర్చాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితాలు నాశనమవుతాయని ఎస్‌ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. పుత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌బాబు, ప్రిన్సిపాళ్లు మధు, జనార్దనరాజు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై దీపావళి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ చెడుపై మంచి విజయం సాధించడంతో దీపావళిని జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మునిరత్నం నాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

● ఎంపీ గురుమూర్తి


పనులను పరిశీలిస్తున్న ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఏర్పేడు వద్ద నిర్మాణంలో ఉన్న రోడ్డు, ఓవర్ బ్రిడ్జి పనులను శనివారం తిరుపతి ఎంపీ గురుమూర్తి పరిశీలించారు. ఏర్పేడు వద్ద 36 రైల్వే క్రాసింగ్ కారణంగా రహదారిపై తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుండడంతో ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు ఆయన తెలిపారు. 2023లో రూ.98.76కోట్లతో బ్రిడ్జి నిర్మాణం మొదలైనా పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయని చెప్పారు. అనంతరం జాతీయ రహదారుల ఇంజనీరింగ్ విభాగ అధికారులతో ఆయన మాట్లాడారు. పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని నెలవాయి, బీఎన్‌కండ్రిగ, పల్లమాల ఉన్నత పాఠశాలల్లో క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి అసెస్‌మెంట్ బుక్ ఇచ్చి పరీక్షలు నిర్వహించాలన్నారు.

వేదోక్తంగా తైలాభిషేకం

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరుడికి శనివారాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరుడిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకించారు. పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.